

పారిశుధ్య కార్మికులకు రక్షణ సామగ్రి అందజేస్తున్న కార్పొరేటర్ మహేందర్

పారిశుధ్య కార్మికులకు రక్షణ కిట్ల పంపిణీ

కూకట్‌పల్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి): ప్రతిరోజూ రోడ్లు, కాలనీల్లో చెత్తను తొలగిస్తూ ప్రజల ఆరోగ్యాని కాపాడుతున్న పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్ట లేనివని మూసాపేట కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ అన్నారు. శుక్రవారం మూసాపేటలో జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులకు రక్షణ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరాన్ని స్వచ్ఛనగరంగా మార్చడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర ఎంతో ఉందన్నారు. రక్షణ పరికరాలు సకాలంలో అందించినట్లయితే వారికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ సూపర్‌వైజర్ జమీల్ అహ్మద్, యాదగిరి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

శ్రావణమాసంలో తీర్థయాత్రలకు బస్సులు నడపాలి

కేపీహెచ్‌బీకాలనీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం ఛాలెంజ్‌ను అందరూ ఇష్టంగా తీసుకొని కూకట్‌పల్లి బస్ డిపో అభివృద్ధికి కృషి చేయాలని హైదరాబాద్ డీఈ ఎం.రాజశేఖర్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం డిపోను ఆకస్మిక తనిఖీ చేసిన ఆయన శ్రావణమాసంలో తీర్థయాత్రలకు బస్సులను నడిపి ఆదాయం సమకూర్చుకోవాలన్నారు. ఉద్యోగులు ఎవరూ డ్యూటీలకు డుమ్మా కొట్టకుండా ఉండాలన్నారు. జీరో యాక్సిడెంట్‌గా డిపో నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ హరి, అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, ఫోర్‌మెన్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



కూకట్‌పల్లి డిపో ఉద్యోగులకు సూచనలు ఇస్తున్న ఈడీ రాజశేఖర్

నకిలీ సర్టిఫికెట్ల తయారీ ముఠా అరెస్ట్

హైదర్‌నగర్, జూలై 25(ఆంధ్రజ్యోతి): నకిలీ సర్టిఫికెట్లు తయారుచేస్తున్న ముఠాను శంషాబాద్ ఎస్ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేపీహెచ్‌బీకాలనీలో హరీష్, మహేష్ శ్రీ వ్యాస కన్సల్టెన్సీని ఏర్పాటు చేశారు. వారు బీకాం, బీటెక్ నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి వాటి ద్వారా పలువురిని విదేశాలకు పంపించినట్లు సమాచారం. వీరికి విజయవాడకు చెందిన మోహన్ అనే వ్యక్తి సహకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు 46 మందికి నకిలీ సర్టిఫికెట్లు విక్రయించినట్లు ఎస్ఓటీ పోలీసులు గుర్తించారు. వీరిలో 24మందిని ఉద్యోగాలు, ఉన్నత చదువుల కోసం విదేశాలకు పంపినట్లు పోలీసులు భావిస్తున్నారు. నిందితుల నుంచి 2 మొబైల్ ఫోన్లు, ఒక డెస్క్‌టాప్ కంప్యూటర్ స్వాధీనం చేసుకున్నారు. నకిలీ డాక్యుమెంట్ల ఆధారంగా విదేశీ వీసాలు పొందిన వారి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు.

రేపు వివేక్‌నగర్‌లో ఉచిత న్యాయ సలహా శిబిరం

కేపీహెచ్‌బీకాలనీ, జూలై 25(ఆంధ్రజ్యోతి): బాలాజీనగర్ వివేక్‌నగర్ కమ్యూనిటీహాల్లో ఈ నెల 27న ఉచిత న్యాయ సలహా శిబిరం నిర్వహిస్తున్నట్లు విజిత్ ఓ ప్రకటనలో తెలిపారు. వీవీలా అసోసియేట్స్, లీగల్ క్రాఫ్ట్ అన్వీక్షికి లా ప్రాక్టీస్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ఉచిత న్యాయ సలహా శిబిరం ఉంటుందన్నారు. పౌర, క్రిమినల్, కుటుంబ వివాదాలు, ఆస్తి, భూమి సమస్యలు, అద్దె నియంత్రణ, మోసం కేసులు, సీనియర్ సిటిజన్స్‌కు చట్టపరమైన రక్షణ, మహిళల హక్కులు, గృహ హింస తదితరు అంశాలపై విపులంగా వివరిస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు 9704757979, 9885883222లో పేర్లు నమోదు చేసుకోవచ్చు.

ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీకాలనీ, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఐటీ కారిడార్‌లో పనిచేసే ఉద్యోగులకు ట్రాఫిక్ సమస్య నుంచి ఉపశమనం కలిగించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులను కోరారు. కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్, కేపీహెచ్‌బీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి ఆయన పలు ప్రాంతాల్లో పర్యటించారు. జేఎన్‌టీయూ చౌరస్తాలో స్కైవే, బాలాజీనగర్ డివిజన్ ఆంజనేయనగర్ చౌరస్తాలో ఫ్లైఓవర్, కూకట్‌పల్లి వై జంక్షన్‌లో ఫ్లైఓవర్, అండర్ పాస్ నిర్మించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి జోనల్ ఎస్ఈ చిన్నారెడ్డి, మూసాపేట్ సర్కిల్ ఇంజనీరింగ్ ఈఈ రమేష్, డీఈ శంకర్, ఏఈ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి జరగడం లేదు..

కూకట్‌పల్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎక్కడా అభివృద్ధి పనులు చేపట్టలేదని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వేలాది కోట్ల రూపాయలతో ఎన్నో అభివృద్ధి పనులు చేశామన్నారు. నగర ప్రజలకు ఇబ్బందులు లేకుండా తాగునీరు, 24 గంటల పాటు విద్యుత్ సరఫరా, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అప్పటి అభివృద్ధిని ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు.



చేపట్టాల్సిన ప్రాజెక్టుల గురించి జడ్సీకి వివరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

రోడ్లను బాగుచేయండి..

కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలో దెబ్బతిన్న రోడ్లను వెంటనే బాగుచేయాలని ఎమ్మెల్యే కృష్ణారావు జడ్సీని కోరారు. శుక్రవారం ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్, జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్‌తో కలిసి వెంకటేశ్వరనగర్‌లో పర్యటించారు. కాలనీవాసులు పలు సమస్యలను వివరించగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

సిగ్నల్స్ వెలగవు.. సిబ్బంది ఉండరు..!

● నిజాంపేట్ చౌరస్తాలో పరిస్థితిపై వాహనదారుల ఆగ్రహం

కేపీహెచ్‌బీకాలనీ, జూలై 25(ఆంధ్రజ్యోతి): నిత్యం రద్దీగా ఉండే నిజాంపేట్ చౌరస్తాలో సిగ్నల్స్ పనిచేయడం లేదు. కనీసం చూద్దామంటే ఒక్కరంటే ఒక్క ట్రాఫిక్ కానిస్టేబుల్ కన్పించకపాయే! శుక్రవారం కొన్ని గంటల పాటు ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేయలేదు. దీంతో రోడ్డు దాటుతున్న వారి కోసం నిమిషాల తరబడి పదేపదే వాహనాలు నిలిచిపోయాయి. మధ్యాహ్నం 3 గంటల సమయంలో స్కూల్ బస్సులు ప్రారంభం కావడంతో ట్రాఫిక్ మరింత పెరిగింది. ఒక పక్క వర్షం.. మరోవైపు ట్రాఫిక్ జాంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. జేఎన్‌టీయూ మెట్రో స్టేషన్‌తో పాటు ఈ చౌరస్తా నిజాంపేట్, బాచుపల్లి, మల్లంపేట్, ఓఆర్ఆర్‌కు వెళ్లే ప్రధాన రహదారి. జేఎన్‌టీయూ నుంచి మియాపూర్ వైపు, హైదర్‌నగర్ వైపు నుంచి కూకట్‌పల్లి వెళ్లే వాహనాలు అన్నీ ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఇటువంటి సమస్యలు పునరావృతం కాకుండా కేపీహెచ్‌బీ పోలీసులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



నిజాంపేట్ చౌరస్తాలో పనిచేయని సిగ్నల్స్

అభివృద్ధి పనులపై సమాచారం ఇవ్వడం లేదు

● కార్పొరేటర్ మాధవరం రోజాదేవి

హైదర్‌నగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వివేకానందనగర్ డివిజన్‌లో అభివృద్ధి పనులకు సంబంధించి కార్పొరేటర్‌కు సమాచారం ఇవ్వకపోవడం ప్రజాస్వామ్యాన్ని అవమానించడమేనని కార్పొరేటర్ రోజాదేవి అన్నారు. దీనిపై శుక్రవారం ఆమె కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. డివిజన్‌లో ఎటువంటి పదవుల్లో లేని వ్యక్తుల సూచనల మేరకు అధికారులు పనిచేస్తున్నారని, ఇలా చేయడం సరికాదని మండిపడ్డారు. 10నెలల క్రితం మంజూరైన సీసీరోడ్డు పనులను ప్రారంభించలేదని, వర్షంకాలం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.



జడ్సీతో మాట్లాడుతున్న కార్పొరేటర్ రోజాదేవి

తడుస్తూనైనా వెళ్లాల్సిందే..!

కూకట్‌పల్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో నగరవాసులు ఇబ్బందులు పడుతున్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో చాలా వరకు రోడ్లు జలమయంగా మారాయి. దీంతో కార్యాలయాలకు వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు విద్యార్థులు నానా తంటాలు పడుతూ పాఠశాలలకు వెళ్తున్నారు. తమ పిల్లలను తడవకుండా తీసుకెళ్లేందుకు తల్లిదండ్రులు అవస్థలు పడుతున్నారు. కొందరు విద్యార్థులు వర్షంలో తడుస్తూనే స్కూళ్లకు వెళ్తున్నారు.



వర్షంలో తడుస్తూ స్కూల్‌కు వెళ్తున్న విద్యార్థులు



ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ అధ్యక్షుడు సుదేశ్‌కుమార్ తదితరులు

సమస్యలు పరిష్కరించండి

హైదర్‌నగర్, జూలై 25(ఆంధ్రజ్యోతి): హఫీజ్‌పేట డివిజన్ సాయినగర్ డబుల్‌బెడ్‌రూం ఇళ్ల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం పీఏసీ ఛైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని వివేకానందనగర్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్ల సముదాయానికి చుట్టూ ప్రహరీ, సీసీరోడ్డు, తాగునీటి కోసం బోరు వేయించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. త్వరలోనే డబుల్‌బెడ్‌రూం ఇళ్లసముదాయంలో పర్యటిస్తానని, సమస్యలు పరిశీలించి పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సుదేశ్ కుమార్, ఉపాధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, జనరల్ సెక్రటరీ చంద్రయ్య, జాయింట్ సెక్రటరీ సక్రూ, ట్రెజరర్ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేటర్ సబీహ బేగంతో సఫ్దర్‌నగర్ ఈ-బ్లాక్ వాసులు

డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి

అల్లాపూర్, జూలై 25(ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్‌లోని సఫ్దర్‌నగర్ ఈ-బ్లాక్‌లో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ లేని కారణంగా మురుగు నీరు నిలిచిపోతుందని ఈ-బ్లాక్ వాసులు శుక్రవారం కార్పొరేటర్ సబీహ బేగంకు ఫిర్యాదు చేశారు. దోమల బెడద వేధిస్తోందని సత్వరమే సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రాము, రమేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అదృశ్యం

హైదర్‌నగర్, జూలై 25(ఆంధ్రజ్యోతి): తీసుకున్న అప్పులు తిరిగి చెల్లించలేక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అదృశ్యమయ్యాడు. కేపీహెచ్‌బీకాలనీ ఎస్ఐ లింగం తెలిపిన వివరాల ప్రకారం.. కటారి కృష్ణవంశీ (25) కేపీహెచ్‌బీ రోడ్ నంబర్-2లోని హాస్టల్‌లో ఉంటూ మాదాపూర్‌లోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలం క్రితం కృష్ణవంశీ లోన్ తీసుకున్నాడు. అప్పు సకాలంలో చెల్లించకపోవడంతో వారు కృష్ణవంశీ అక్క అంజలికి ఫోన్ చేసి డబ్బులు కట్టాలని అడిగారు. ఆమె తన తమ్ముడితో మాట్లాడి అప్పు తీరుస్తామని వారికి హామీ ఇచ్చింది. ఈ నెల 20న అంజలి కృష్ణవంశీతో మాట్లాడగా ఆ తర్వాత నుంచి అతను ఫోన్‌లో అందుబాటులో లేకుండా పోయాడు. దీంతో అంజలి కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

గంజాయి విక్రేత అరెస్ట్

కూకట్‌పల్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని మేడ్చల్ ఎస్ఓటీ సిబ్బంది బాలానగర్ పోలీసులతో కలిసి శుక్రవారం అరెస్టు చేశారు. నిందితుడి వద్ద ఉన్న 100 గ్రాముల గంజాయి (22 ప్యాకెట్లు), ఓ మొబైల్ స్వాధీనం చేసుకున్నారు. బాలానగర్ సీఐ నర్సింహరాజు తెలిపిన వివరాల ప్రకారం.. సనత్‌నగర్‌లోని ఎన్‌టీఆర్ నగర్ నివాసి నరేష్(27) ఆటో డ్రైవర్. అతడు కొంతకాలంగా గంజాయి స్మగ్లింగ్ చేస్తున్నాడు. బాలానగర్‌లో విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు అరెస్టు చేశారు.



డైమండ్ హైట్స్ అపార్టుమెంట్ వాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్

మౌలిక వసతుల కల్పనకు శక్తివంచన లేకుండా కృషి

● కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం, జూలై 25(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లిలోని మంజీర డైమండ్ హైట్స్ అపార్ట్‌మెంట్ వాసులు ఏర్పాటు చేసిన సమావేశానికి గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తమ ప్రాంతంలో అసంపూర్తిగా మిగిలిపోయిన యూజీడీ పైపులైను పనులను పూర్తి చేయాలని, తాగునీటి వసతి మెరుగుపర్చాలని, వీధి దీపాలు సక్రమంగా వెలిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కార్పొరేటర్‌ను కోరారు. కాలనీలోని పార్కులో ఓపెన్‌జిమ్, చిల్డ్రన్స్ పార్కు, క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. స్పందించిన కార్పొరేటర్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని కోరారు. మౌలిక వసతుల కల్పనకు శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఆర్‌రావు, అతుల్, సత్యనారాయణరెడ్డి, ఫణి, వెంకటేష్, వరుణ్, సత్యనారాయణ, ప్రవీణ్ పాల్గొన్నారు.

భాగీదారి న్యాయ సమ్మేళనంలో కార్పొరేటర్ దొడ్ల

హైదర్‌నగర్, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఓబీసీ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలని డిమాండ్ చేస్తూ న్యూఢిల్లీలో బీసీ సంఘాల ఆధ్వర్యంలో భాగీదారి న్యాయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్, నాయకులతో కలిసి ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో చేపట్టిన కుల సర్వే విధివిధానాలు, కులగణన సర్వే చేసిన తీరుపై సమీక్షించినట్లు తెలిపారు.



భాగీదారి న్యాయ సమ్మేళనం ప్రాంగణం వద్ద కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్



ప్రచార కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

ఆగస్టు 2న సీపీఐ రంగారెడ్డి జిల్లా మహాసభ

గచ్చిబౌలి, జూలై 25(ఆంధ్రజ్యోతి): సీపీఐ రంగారెడ్డి జిల్లా 17వ మహాసభను ఆగస్టు 2న నిర్వహిస్తున్నట్లు పార్టీ శేరిలింగంపల్లి కార్యదర్శి రామకృష్ణ, నాయకుడు చందుయాదవ్ తెలిపారు. శుక్రవారం గచ్చిబౌలి చౌరస్తాలోని ఆటో స్టాండ్‌లో జరిగిన సమావేశంలో వారు సభ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా వారు ప్రచార కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ.. శేరిలింగంపల్లిలో పేదల కోసం ఎన్నో ఉద్యమాలు చేసి సుమారు 20 బస్తీలను ఏర్పాటు చేశామన్నారు. ఈ బస్తీల్లో నివాసం ఉంటున్నవారంతా బడుగు బలహీన వర్గాల వారేనని, భవిష్యత్తులో కూడా పేదల సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. ఆగస్టు 2న జరిగే మహాసభకు శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

ఘనంగా ప్రారంభమైన శ్రావణమాసం పూజలు

ఖైల్‌కాలనీ, జూలై 25(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం సందర్భంగా బెల్ ఎంఐజీకాలనీలోని రామాలయంలో నెలరోజుల పాటు జరిగే కలశపూజలను శుక్రవారం ప్రారంభించారు. దేవాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపంలో అష్టలక్ష్మీ రూపాలతో ఉత్సవ విగ్రహాలు, కలశాలను ఏర్పాటు చేసి పట్టు వస్త్రాలతో అలంకరించి పూజలు చేశారు. నెల రోజుల పాటు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం కలశపూజలు జరుగుతాయని నిర్వాహకులు చెప్పారు. విశేష పర్వదినాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని, పూజలు చేయించుకునే భక్తులు దేవాలయ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో..

బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని వెంకటేశ్వర-యోగేశ్వర స్వామి దేవాలయంలో శ్రావణ మాస ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణంలోని పద్మావతి అమ్మవారి ఆలయం, లక్ష్మీనరసింహస్వామి ఆలయం, జ్ఞానసరస్వతి అమ్మవారి ఉపాలయాల్లో శ్రావణమాసం పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నిత్యార్చనలు, అభిషేకాలతో పాటు విశేష పూజలు, అర్చనలు జరగగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పెద్దమ్మ తల్లి ఆలయంలో అమ్మవారికి విశేష హారతులు ఇచ్చారు.



విశేష అలంకరణలో పెద్దమ్మ తల్లి



గులాబీల అలంకరణలో తుల్జాభవాని అమ్మవారు

తారానగర్‌లో..

గచ్చిబౌలి, జూన్ 25(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి తారానగర్‌లోని తుల్జాభవాని అమ్మవారిని గులాబీలతో అలంకరించారు. శ్రావణమాసం మొదటి శుక్రవారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

దోమల నివారణపై విద్యార్థులకు అవగాహన

హైదర్‌నగర్, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ సుభాష్‌చంద్రబోస్ కాలనీ ఎస్‌వీఎస్ హైస్కూల్‌లో శుక్రవారం దోమల నివారణ, దోమకాటు ద్వారా వచ్చే వ్యాధులపై కూకట్‌పల్లి ఎంటమాలజీ విభాగం అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దోమకాటు ద్వారా డెంగ్యూ ఫీవర్, మలేరియా, చికెన్‌గునియా, బోధకాలు, మెదడువాపు తదితర వ్యాధులు వస్తాయని వివరించారు. ఇవి రాకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఇంటి పరిసరాల్లో నీరు నిల్వలేకుండా చూసుకోవాలని సూచించారు. విద్యార్థులు తాము నేర్చుకున్న విషయాలను తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించాలని చెప్పారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎంటమాలజీ సూపర్‌వైజర్ నరసింహులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంటమాలజీ అధికారులు



చిరాగ్ పాశ్వాన్‌తో సురేందర్

ఎల్జేపీ జాతీయ అధ్యక్షుడిని కలిసిన సురేందర్

ఖైల్‌కాలనీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) జాతీయ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్‌ను జనశక్తి మజ్దూర్ సంఘ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జి.సురేందర్ కలిశారు. రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించిన సందర్భంగా ఢిల్లీలోని పార్టీ కార్యాలయంలో ఆయన్ను కలిశారు. తెలంగాణలో కార్మిక సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని చిరాగ్ పాశ్వాన్ సూచించినట్లు సురేందర్ తెలిపారు. కార్యక్రమంలో లోక్ జనశక్తి పార్టీ లేబర్ సెల్ జాతీయ అధ్యక్షుడు రాజేష్, జాతీయ కార్యదర్శి విజయ్, ఉపాధ్యక్షుడు సుందర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గచ్చిబౌలి, జూలై 25(ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలు పరిష్కరించి సంక్షేమ పథకాలు అందించాలని కోరుతూ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘం చైర్మన్ లక్ష్మయ్య, బీసీ ఐక్య వేదిక అధ్యక్షుడు బేరి రామచంద్రయాదవ్ మంత్రి వివేక్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్మికులు, రోజువారీ కూలీలకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని, వారి పిల్లలకు హాస్టల్స్‌లో సీట్లు కేటాయించాలని, వైద్యం, బీమా వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ ఫెడరేషన్ అధ్యక్షుడు సాయన్నముదిరాజ్, రాము, అనంతయ్య, కుమార్‌యాదవ్, ఆనంద్, కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గం చెరువులో దూకబోయిన యువకుడు.. కాపాడిన హైడ్రా సిబ్బంది

హైదరాబాద్ సిటీ, జూలై 25(ఆంధ్రజ్యోతి): దుర్గం చెరువులో దూకబోతున్న యువకుడిని హైడ్రా డీఆర్‌ఎఫ్ సిబ్బంది కాపాడారు. మద్యం మత్తులో ఇంట్లో వారితో గొడవపడిన రామిరెడ్డి(26) శుక్రవారం సాయంత్రం దుర్గం చెరువు కేబుల్ వంతెన రెయిలింగ్ ఎక్కి చెరువులో దూకేందుకు ప్రయత్నించాడు. అక్కడున్న సిబ్బంది అప్రమత్తమై రామిరెడ్డిని కాపాడారు. గొడవ నేపథ్యంలో భార్య పుట్టింటికి వెళ్లగా రామిరెడ్డిని పోలీసులు అతడి సోదరికి అప్పగించారు.



ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ అధ్యక్షుడు సుదేశ్‌కుమార్ తదితరులు

సమస్యలు పరిష్కరించండి

హైదర్‌నగర్, జూలై 25(ఆంధ్రజ్యోతి): హఫీజ్‌పేట డివిజన్ సాయినగర్ డబుల్‌బెడ్‌రూం ఇళ్ల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని వివేకానందనగర్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్ల సముదాయానికి చుట్టూ ప్రహరీ, సీసీరోడ్లు, తాగునీటి కోసం బోరు వేయించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. త్వరలోనే డబుల్‌బెడ్‌రూం ఇళ్లసముదాయంలో పర్యటిస్తానని, సమస్యలు పరిశీలించి పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సుదేశ్‌కుమార్, ఉపాధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, జనరల్ సెక్రటరీ చంద్రయ్య, జాయింట్ సెక్రటరీ సక్రూ, ట్రెజరర్ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమాచారం ఇవ్వడం లేదు

● జడ్సీకి ఫిర్యాదు చేసిన కార్పొరేటర్ మాధవరం రోజాదేవి

హైదర్‌నగర్, జూలై 25(ఆంధ్రజ్యోతి): వివేకానందనగర్ డివిజన్‌లో అభివృద్ధి పనులకు సంబంధించి కార్పొరేటర్‌కు సమాచారం ఇవ్వకపోవడం ప్రజాస్వామ్యాన్ని అవమానించడమేనని కార్పొరేటర్ రోజాదేవి అన్నారు. దీనిపై శుక్రవారం ఆమె కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. డివిజన్‌లో ఎటువంటి పదవుల్లో లేని వ్యక్తుల సూచనల మేరకు అధికారులు పని చేస్తున్నారని, ఇలా చేయడం సరికాదని మండిపడ్డారు. 10 నెలల క్రితం మంజూరైన సీసీరోడ్డు పనులను ప్రారంభించలేదని, వర్షాకాలం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఫొటోగ్రఫీ ఎంట్రీలకు హెచ్‌సీయూ ఆహ్వానం

హైదరాబాద్ సిటీ, జూలై 25(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఫొటోగ్రఫీ కాంటెస్ట్-2025ను నిర్వహిస్తోంది. ఈ మేరకు వర్సిటీలోని కమ్యూనికేషన్ విభాగం, ఫొటోగ్రఫీ ఔత్సాహికుల నుంచి ఎంట్రీలను ఆహ్వానిస్తోంది. సృజనాత్మక దృశ్య కథలను ప్రోత్సహించడంతో పాటు ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లు తమ ప్రతిభను ప్రదర్శించడానికి హెసీయూ వేదిక కల్పిస్తోంది. పోటీకి ఎంట్రీ ఉచితం కాగా, ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లు తమ ఫొటోలను ఆగస్టు 10లోగా అందించాలి. వర్సిటీ ప్రాంగణంలో ఆగస్టు 19 నుంచి 23వరకు జరిగే ఎగ్జిబిషన్‌లో ఎంట్రీలను ప్రదర్శిస్తామని నిర్వాహకులు తెలిపారు. ముగ్గురు విజేతలకు అవార్డులు, మెరిట్ సర్టిఫికెట్లు, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు ఇస్తామన్నారు. వివరాలకు 8247559845, 7815859656 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు



పేట్‌బషీరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఫీడర్ల మరమ్మతు కారణంగా శనివారం పేట్‌బషీరాబాద్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఈ కింది ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ జ్ఞానేశ్వర్ తెలిపారు. ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకు జయరామ్‌నగర్, శ్రీకృష్ణానగర్, గణేష్‌కాలనీ, జేకే నగర్, రుక్మిణి ఎస్టేట్స్ ప్రాంతాలలో కరెంట్ ఉండదన్నారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 3.30 గంటల వరకు సుచిత్ర చౌరస్తా మెయిన్‌రోడ్డు, షాపింగ్ మాల్స్, కరాచీ బేకరీ, టీఎస్ఆర్ అపార్టుమెంట్స్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. అలాగే, కొంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 11 నుంచి 12 గంటల వరకు జయభేరి, బ్యాంక్ కాలనీ, జయభేరి శివాలయం, శ్రీనివాస్ కాలనీ, ఎన్‌సీఎల్ నోబుల్ ఎన్‌క్లేవ్, ఎన్‌సీఎల్ కాలనీ, సినీప్లానెట్ రోడ్డు, కేవీఆర్ గార్డెన్, విజయశాంతి విల్లాస్, కొంపల్లి గ్రామంలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శ్రీనివాస్ వెల్లడించారు.

28న తాత్కాలిక అధ్యాపక పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

దుండిగల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : బహదూర్‌పల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేసేందుకు ఈ నెల 28న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బండి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. బోటనీ, కామర్స్, కంప్యూటర్ సైన్స్, ఎకనామిక్స్, ఇంగ్లిష్ హిస్టరీ, ఫిజిక్స్, పొలిటికల్ సైన్స్, తెలుగు, జియాలజీ లెక్చరర్ పోస్టులను భర్తీ చేస్తామన్నారు.. పీజీలో ఆయా సబ్జెక్టులో కనీసం 55 శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. పీహెచ్‌డీ ఉన్న వారికి నియామకాల్లో ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 28న మధ్యాహ్నం 12 గంటలకు ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లతో కళాశాల ప్రాంగణంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ కోరారు.

పారిశుధ్య కార్మికులకు భద్రతా కిట్ల పంపిణీ

జీడిమెట్ల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులు తమ ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు పాటించాలని సుభాష్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ గుడిమెట్ల హేమలత సురేష్‌రెడ్డి అన్నారు. జీహెచ్‌ఎంసీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన భద్రతా కిట్లను తన కార్యాలయంలో కార్మికులకు అందజేశారు. వర్షాకాలంలో కార్మికులకు ఈ కిట్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ సర్కిల్ వైద్యాధికారి డాక్టర్ కవిత, జిలానీ శివాజీ, మంగ, శ్రీనివాస్, రత్న పాల్గొన్నారు.



జగద్గిరిగుట్టలో పర్యటిస్తున్న డీసీ మల్లారెడ్డి తదితరులు

అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోండి: డీసీ

జీడిమెట్ల, జూలై25 (ఆంధ్ర జ్యోతి): వర్షాకాలంలో అంటువ్యాధులు వ్యాపించకుండా తగు జాగ్రత్తలు తీసు కోవాలని గాజులరామారం డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి అన్నారు. శుక్రవా రం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని పలు బస్తీల్లో ఆయన పర్యటించారు. వర్షాకాలంలో నీరు ఎక్కడా నిల్వ లేకుండా చూడాలని తమ సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు. దోమల నివారణకు ఫాగింగ్ తప్పనిసరిగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకుడు కొలుకు జైహింద్, సిబ్బంది చారి, వెంకటేష్, శ్రీనివాస్, విటల్‌గౌడ్,జగన్,కిరణ్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి ఎల్‌ఓసీల అందజేత

కుత్బుల్లాపూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : జీడిమెట్ల డివిజన్ న్యూవివేకానందనగర్‌కు చెందిన లక్ష్మమ్మ(72), గాజులరామారం గ్రామానికి చెందిన మహ్మద్ బషీరుద్దీన్(57)ల వైద్య చికిత్సల నిమిత్తం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం మంజూరు చేయించారు.లక్ష్మమ్మకు రూ.2 లక్షలు,బషీరుద్దీన్‌కు రూ.2.25 లక్షలు మంజూరు కాగా, ఇందుకు ఎల్‌ఓసీ పత్రాలను శుక్రవారం చింతల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గా జులరామారం డివిజన్ పార్టీ అధ్యక్షుడు విజయరాంరెడ్డి. నాయకులు, కస్తూరి బాలరాజు, కమలాకర్, సంపత్ మాధవరెడ్డి, సుధాకర్‌గౌడ్ లబ్ధిదారులకు అందజేశారు.

ఆలయాల్లో 'శ్రావణ' సందడి

- మొదలైన మాసం
- అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు, అర్చనలు



గురుమూర్తినగర్‌లోని పోచమ్మతల్లి ఆలయంలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు



కట్టమైసమ్మ ఆలయంలో..



రంగారెడ్డి నగర్ శివాలయంలో

పేట్‌బషీరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం మహిళలకు ప్రత్యేక మాసంగా చెప్పవచ్చు. శుక్రవారం నుంచి ప్రారంభమైన ఈ మాసంలో మహిళలు మంగళగౌరి, శ్రావణలక్ష్మి, వరలక్ష్మి పూజలు, వ్రతాలతో ఎంతో సందడిగా గడుపుతారు. అమ్మవారి ఆరాధన, నోములు, వ్రతాల వల్ల స్త్రీలకు సకల సౌభాగ్యాలు కలుగుతాయని వారి నమ్మకం. లక్ష్మీదేవి జన్మించింది శ్రావణ మాసంలో అని పురాణాలు చెప్తున్నాయి. ఈమాసంలో చేసే అన్ని పూజల్లోకి వరలక్ష్మి వ్రతం ఉత్తమమైంది. జీడిమెట్ల డివిజన్‌లోని పేట్‌బషీరాబాద్ రుక్మిణి ఎస్టేట్, కట్టమైసమ్మ, మూడుగుళ్ల ఆలయం, రంగారెడ్డినగర్ డివిజన్ గురుమూర్తి నగర్‌లోని అమ్మవారి ఆలయాల్లో శుక్రవారం మహిళలు పెద్ద ఎత్తున పూజలు చేసి, కుంకుమార్చనలు నిర్వహించారు.

29న అంతర్జాతీయ పులుల దినోత్సవం

పేట్‌బషీరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): దూలపల్లి ఫారెస్టులోని రాష్ట్ర అటవీ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 29న అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్ఓ) వై. సుభాష్‌చంద్ర యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా నగరంలోని 23 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 350 మంది విద్యార్థినీ విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలు నిర్వహించి, పర్యావరణ పరిరక్షణ, పులుల ప్రాధాన్యతపై అవగాహన కల్పించామన్నారు.

'అక్రమ నిర్మాణ అనుమతులు రద్దు చేయాలి'

నిజాంపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట కార్పొరేషన్‌లో ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపట్టేందుకు ఇచ్చిన అక్రమ అనుమతులను రద్దు చేసి, ఆ భూములను స్వాధీనం చేసుకొని, నిర్మాణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని నిజాంపేట కార్పొరేషన్ బీజేపీ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్, రెవెన్యూ అధికారులకు వేర్వేరుగా శుక్రవారం వినతిపత్రాలు సమర్పించాడు. ఈ సందర్భంగా ఆకుల సతీష్ మాట్లాడుతూ నిజాంపేట గ్రామంలో సర్వే నెంబరు 274లో రెండు విల్లాల నిర్మాణానికి టీఎస్‌బీపాస్ ద్వారా ఇన్‌స్టంట్ అనుమతులు తీసుకొని, ఇందిరమ్మ కాలనీ బ్లాక్ నెంబరు 21 లోని వెనుక భాగం వైపు ఉన్న ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 233/15లోని ప్రభుత్వ భూములో రెండు విల్లాలు నిర్మిసున్నారని తెలిపారు. తక్షణమే విల్లాల నిర్మాణం నిలిపి వేసి, ఈ ప్రభుత్వ భూమిని కాపాడాలని ఆయన కోరారు.

'ప్లాట్‌కు రెండు మొక్కలు నాటాలి'

గాజులరామారం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ ప్లాట్‌కు రెండు మొక్కలను నాటి, రాబోయే తరానికి కాలుష్య రహిత వాతావరణాన్ని అందించేందుకు కృషి చేయాలని గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. గాజులరామారం డివిజన్‌లోని మహాదేవపురం కాలనీలో ఆయన స్థానికులతో కలిసి శుక్రవారం మొక్కలను నాటారు. కార్యక్రమంలో మహేశ్వర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, భాస్కర్. అంజిబాబు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

శిథిలమైన మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



శిథిలమైన మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేసిన దృశ్యం

కుత్బుల్లాపూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : 'నాణ్యత లేని అభివృద్ధి పనులు' శీర్షికతో ఆంధ్రజ్యోతి శుక్రవారం ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. కుత్బుల్లాపూర్ డివిజన్ చెరుకుపల్లి కాలనీలో శిథిలమైన మ్యాన్‌హోల్‌కు మధ్యాహ్నం మరమ్మతులు చేయించారు. సమస్య పరిష్కారానికి సహకరించిన ఆంధ్రజ్యోతికి స్థానికులు, వాహనదారులు కృతజ్ఞతలు తెలిపారు.



సీసీ రోడ్డు ప్రారంభోత్సవంలో పాల్గొన్న హన్మంత్‌రెడ్డి, కాలనీవాసులు

మల్లంపేటలో సీసీ రోడ్డు ప్రారంభం

దుండిగల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేట గ్రామంలోని ప్రధాన రోడ్డులో గుంతలు ఏర్పడి పాదచారులు, వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని గ్రామస్తులు కొందరు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేయగా, ఆయన మున్సిపల్ అధికారులతో మాట్లాడి మున్సిపాలిటీ నిధులతో సీసీ రోడ్డు వేయించారు. ఈ రోడ్డులను శుక్రవారం స్థానికులతో కలిసి హన్మంత్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం స్థానికులు శాలువాతో ఆయనను సన్మానించి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రె స్ పార్టీ జనరల్ సెక్రటరీ పద్మారావు, సీనియర్ నాయకులు ప్రకాశ రావు, మల్లేష్, శ్రీను, హరివర్ధన్‌రావు, రేవంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మనోజ్‌రెడ్డి, రాకేశ్, అంజయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



నిందితురాలి అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ సురేష్‌కుమార్

జైలుకెళ్లొచ్చినా బుద్ధి మారలేదు!

- జల్సాల కోసం ఇళ్లలో చోరీలు
- పాతనేరస్తురాలి అరెస్టు
- 22.3తులాల బంగారం, వెండి స్వాధీనం

జీడిమెట్ల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తాళాలు వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసుకుని చోరీలకు పాల్పడుతున్న ఓ పాతనేరస్తురాలిని జగద్గిరిగుట్ట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఆమె వద్ద నుంచి 22.3 తులాల బంగారు నగలు, 5 తులాల వెండి స్వాధీనం చేసుకున్నారు. బాలానగర్ డీసీపీ కార్యాలయంలో శుక్రవారం డీసీపీ డీసీపీ సురేష్‌కుమార్ విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం...ఉత్తరప్రదేశ్‌లోని పిప్రోలి గ్రామానికి చెందిన బేబి అలియాస్ అరోహి (21) కొంతకాలంగా నగరంలోని మధునగర్‌లో నివాసముంటూ సేల్స్‌గార్ల్‌గా పని చేస్తోంది. జల్సాలకు అలవాటుపడిన బేబీ ఫేస్‌బుక్‌లో తన పేరు ఫ్రాంక్లిన్ అలియాస్ చింటూ, కర్ణాటక ప్రాంతంలోని బెల్గావిగా పరిచయం చేసుకుంది. డబ్బు సంపాదన కోసం తాళాలు వేసి ఉన్న ఇళ్లను గుర్తించి దొంగతనాలు చేస్తోంది. గతంలో బోరంబండ ప్రాంతంలో రెండు దొంగతనాలు చేసి చంచల్‌గూడ జైలులో శిక్ష అనుభవించింది. అయినా ఆమె వక్రబుద్ధి మారలేదు. గత నెల 28వ తేదీన జైలు నుంచి విడుదలైన బేబీ ఈనెల 18వ జగద్గిరిగుట్ట ప్రాంతంలోని ఆల్విన్‌కాలనీకి చెందిన విప్పర్తి చిరంజీవి(39) అనే వ్యక్తి ఇంటికి తాళం వేసి కుటుంబ సమేతంగా బయటకు వెళ్లాడు. తాళాన్ని చెప్పుల స్టాండ్‌లోని హెల్మెట్‌లో పెట్టి వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం తెరచి ఇంట్లోని బీరువాలో గల 22.3తులాల బంగారు నగలు, 5తులాల వెండి, దొంగిలించుకుపోయారు. బాధితుడు జగద్గిరిగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా దొంగతనాకి పాల్పడింది. బేబి అని గుర్తించి ఆమెను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో చోరీకి పాల్పడినట్టు అంగీకరించింది. బంగారు నగలు, వెండి స్వాధీనం చేసుకుని ఆమెను రిమాండ్‌కు తరలించారు. విలేకరుల సమావేశంలో బాలానగర్ ఏసీపీ పి.నరేష్‌రెడ్డి, జగద్గిరిగుట్ట సీఐ నర్సింహ, డీఐ పి.నరేందర్‌రెడ్డి, ఇతర సిబ్బందిపాల్గొన్నారు.

హెచ్‌ఎంటీ కాలనీలో క్షుద్రపూజల కలకలం

కుత్బుల్లాపూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : చింతల్ డివిజన్ హెచ్‌ఎంటీ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే రోడ్డులో శుక్రవారం ఉదయం క్షుద్రపూజలు కలకలం రేపాయి. స్థానికుల కథనం ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తులు మూడు రోడ్ల ప్రాంతంలో అన్నంకు పసుపు, కుంకుమ, నలుపు రంగులు రుద్ది, నిమ్మకాయలతో కూడిన భోజనాన్ని నల్లటి రంగు బట్ట, ఆకుల్లో పెడుతుండగా కొందరు గమనించి కేకలు వేశారు. దీంతో ఆ దుండగులు అక్కడి నుంచి పరారయ్యాం రు. ఒకవేళ ఎవరు చూగకుంటే ఇంకా ఏమేం చేసే వారోనని, ఇలాంటి వారిని గుర్తించి పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.